మనయ్య మరణం

జి. రాజ్యలక్ష్మీగుప్తా

అది ఒక ఊరు.

పల్లె వాతావరణానికి పట్నం వాతావరణానికి మధ్యస్థంగా వుంది

బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగు పెడుతున్న కన్నెపిల్లలా, పల్లె వాసనలను వదలి పట్నంగా రూపొందుతుంది. ఆ ఊరు.

అప్పటి వరకు ఆ ఊళ్ళో ఆధునిక వసతులు లేవు. వెనుకబడిన ఊరి క్రింద ప్రభుత్వం ఆ ఊరిని చేపట్టి పట్నంగా మార్చడానికి ప్రయత్నిస్తోంది.

అనేక ఆధునిక సదుపాయాలను సంతరించుకొని క్రొత్త అందాలను రూపు దిద్దుకొంటోంది.

ఆ ఊరి ఆధునిక అందాలకు పెద్దలు, పిన్నలు సంబరపడుతుంటే, ఆ సంబరాన్ని సంతోషంగా అనుభవించలేని వ్యక్తి మనయ్య ఒక్కడే.

మనయ్య ఎక్కడ పుట్టాడో, ఎవరికి పుట్టాడో, ఆ ఊళ్ళో వారి కెవరికీ తెలియదు. ఎలా ఆ వూళ్ళో అడుగు పెట్టాడో, ఎవరిని అడిగినా, తెలియదంటారు. వూహ బుద్ధెరిగిన నాటి నుంచి ఆ ఊళ్ళో బ్రాహ్మణుల పంచలో పెరిగాడు. మిగిలిన కులాల వారందరు బ్రాహ్మణుల పిల్లవాడనుకున్నారు. అందరికీ తలలో నాలుకలా ఉండి అన్ని పనులు చేస్తుండేవాడు. మన అయ్య, మన అయ్య అంటూ అందరూ పిలవడంతో ఆఖరికి ఆ పదం మనయ్యగా మారి అదే పేరుగా స్థిరపడింది. లేచింది మొదలు ఆ వాడలో ఏ తల్లి మొదటి ముద్ద పడేస్తే, ఆ తల్లికి సాయం చేసేవాడు. తల్లిదండ్రులు లేని మనయ్యకు ఆ వాడలోని వాళ్ళందరూ తల్లిదండ్రులే!

మనయ్యకు మొదట్లో ఏ పని చేయాలో, ఏ పని చేయకూడదో, ఎవరికి చెయ్యాలో, ఎవరికి చేయకూడదో తెలిసేది కాదు.

కాస్త ఊహ తెలిసాక తను చేయకూడని పనులు తెలుసుకున్నాడు. తను ఎవరికి చెయ్యాలో తనే ఊహించుకొనేవాడు.

అక్షరాభ్యాసం చేయడానికి 'నా' అన్న వాళ్ళెవరూ లేరు. చదువుకోవాలన్న ధ్యాస కాని, సమయం కాని లేదు. మంత్రాలు రాని పంతులని పేరు పొందాడు

మనయ్య బాల్యాన్ని వదలి యవ్వనంలోకి అడుగు పెడుతున్నాడు. అతని దిన చర్యలో మార్పు లేదు. తల్లిదండ్రి అయిన ఆ ఊరిలోని వాళ్ళు మనయ్యకు పెళ్ళి చేయాలనుకున్నారు

ఊర్లోని పెద్దలు "పెళ్ళి చేసుకుంటావా?" మనయ్య అని అడిగితే ముసి ముసిగా నవ్వి వూరుకొనేవాడు.

కళ్యాణ ఘడియ వచ్చినా, కక్కొచ్చినా ఆగదన్నట్టు ఓ బీద పంతులు తన కూతురిని పెళ్ళి చేసుకొమ్మని మనయ్యను బ్రతిమాలాడు.

తన హీన, బీద స్థితిని తెలిసి కూడా, తన కూతురి కన్నె చెరను విడిపించమని తనను బ్రతిమాలుతున్న ఆ వృద్ధ బ్రాహ్మణుని చూసి జాలిపడి సరే అన్నాడు.

ఆ కన్నతండ్రి మనసు సంతోష తరంగాలలో తేలిపోయింది. రంగ, రంగ వైభోగంగా పెళ్ళి జరగకపోయినా ఆకాశమంత పందిరి లేకపోయినా, భూదేవంత అరుగు కాకపోయినా, ఆ వాడలోని వారందరూ ఆ పెళ్ళికి హాజరయ్యారు. వారందరి ఆప్యాయత అక్షంతల రూపంలో మనయ్య మీద పడుతుంటే తెలియని ఆనందంతో తేలిపోయాడు.

అమ్మయ్య! మనయ్యకు కూడా పెళ్ళయింది. అనుకున్నారు ఊళ్ళోని వారంతా. తమందరికి ఎంతో భారం దిగిపోయినట్టు.

అంత వరకు ఆ పంచల్లో, ఈ పంచల్లో పడుకొని కాలం గడుపుతున్న మనయ్య, భార్యతో సహా ఆ పంచల్లోనే పడుకోవడానికి సిద్ధమయ్యాడు.

భర్త వాలకాన్ని చూసిన మనయ్య భార్య పిచ్చి దానిలా, ఏమి చెప్పాలో తెలియని దానిలా నిలబడింది. అంతలో దేవుడు పంపిన దేవతలా ఆ యింటి యజమానురాలు బయటకు వచ్చి చూసి,

"మనయ్యా! నిన్ను సుందరమ్మగారు రమ్మన్నారు. వాళ్ళింట్లో ఓ చిన్నగది ఖాళీగా ఉందంట. అక్కడకు వెళ్ళండి" అంది.

ఆ సమయంలో తమ పరువును కాపాడడానికి వచ్చిన దేవతలా ఉన్న ఆమెకు చేతులెత్తి నమస్కరించింది మనయ్య భార్య. మనయ్య వెనుకగా నడుస్తూ.

సుందరమ్మ ఆ వాడలో చాల పితంతువుగా పేరు మోసింది. ఆవిడకు ఆస్తి అంటూ ఉన్నది. ఆ ఒక్క చిన్నగది మాత్రమే.

ఆ గదికి సున్నం వేసి తరాలయింది. చుట్టూ నాలుగు గోడలు నామ మాత్రంగానే ఉన్నాయి. పైన కప్పును చూస్తే ఉందో, లేదో అనే అనుమానం వస్తుంది. ఆ ఇంటి లోపల గోడలను, సూర్యుడు, చంద్రుడు ప్రతిరోజు వచ్చి పరామర్శించి పోతుంటారు.

మనయ్య ఆ ఇంటిని వింతగా చూస్తూ నిలబడ్డాడు.

"మనయ్యా! నా ఇంట్లో గది కావాలంటే నెలకు పది రూపాయలు బాడుగ ఇవ్వాలి. అట్లయితేనే నా ఇంట్లో ఉండు" అంది నిక్కచ్చిగా

రోజుకు పది పైసలు కూడా సంపాయించలేని మనయ్యకు పది రూపాయల కాగితం ఎలా వుంటుందో తెలియదు. ఆ పది రూపాయల కోసం ఎన్ని రోజులు కష్టపడాలో కూడా తెలియదు.

సందిగ్ధావస్థలో నున్న మనయ్యను చూసి సుందరమ్మ ఏదో అనే లోపునే, "సరే, అలాగే" అంటూ మనయ్యను చెయ్యి పట్టి ఇంట్లోకి తీసుకు వెళ్ళింది మనయ్య భార్య.

అంతవరకూ అతని చేయి ఎవరి చేతిని తాకలేదు. స్త్రీ స్పర్శను ఎరిగిలేదు. ఆప్యాయంగా పట్టుకున్న ఆ చేతిని తన చేతిలో వుంచుకోవాలో, వదలాలో తెలియక సంతోషంగా, కాస్త సిగ్గుగా భార్యను చూసాడు.

తను పడవలసిన అవస్థ తన భర్త పడుతున్నందుకు అమాయకంగా నవ్వింది మనయ్య భార్య.

ఆ రాత్రి ఆ నూతన దంపతులకు కటిక నేలకాని, కనీస అవసరాలు గాని గుర్తుకు రాలేదు

తెల్లవారింది. అందరికీ తెల్లవారడం వేరు. మనయ్యకు తెల్లవారడం వేరు. తెల్లవారి లేస్తూనే ముందుగా ఎవరింట్లో పనికి రమ్మని చెపితే వాళ్ళింటికి వెళ్ళేవాడు. ఆ రోజంతా ఆ ఇంట్లో పనులతో, వారు పెట్టిన తిండితో గడిపేవాడు. ఈ రోజు అట్లా చెయ్యడానికి అతని మనస్సు ఒప్పడం లేదు. భార్యను ఒక్కదాన్ని ఇంట్లో వుంచి తన దారిన తాను పోలేక పోయాడు.

కాలు గాలిన పిల్లిలా తెల్లవారిన దగ్గర నుంచి ఇంట్లోకి, బయటకు తిరగ సాగాడు.

భర్త రోజూ చేస్తున్నట్లుగా, చేసే పనులకు పంపడం ఇష్టం లేదు మనయ్య భార్యకు.

"ఈ రోజు నుంచి మీరు ఇంకేమైనా పనులు చేయండి" అంది దీనంగా.

"ఏం చెయ్యమంటావు" అన్నాడు అంతకంటే దీనంగా.

"అందరూ చేస్తున్నట్లుగానే, మీరు ఏదో ఒకటి చెయ్యండి అంది" ఏం చెయ్యాలో చెప్పడం తెలియక.

తనకు తెలిసిన వాళ్ళందరూ ఏం చేస్తున్నారో ఆలోచించాడు.

కొందరు పౌరోహిత్యం చేస్తుంటే, మరికొందరు పిల్లలకు పాఠాలు చెప్పుతున్నారు. ఇంకొందరు ఇంటింటికి వెళ్ళి ఆ రోజు తిథి, వారం, వర్జ్యం చెప్పి, వాళ్ళు పెట్టిన భిక్ష పట్టుకెళుతుండేవారు.

ఆ పనుల్లో ఏ పనీ చేతకాదు మనయ్యకు.

మధ్యాహ్నం వరకూ ఆలోచనలతో, ఏం చెయ్యాలో తెలియక బయటకు వెళ్ళలేదు మనయ్య.

ఆ ఒక్క పూటలోనే ఆ వాడలోని ఆడవాళ్ళకు మనయ్య లేని లోటు తెలిసి వచ్చింది.

ఆలోచించి, ఏమీ తోచక, కరణం గారింటికి వెళ్ళాడు మనయ్య.

మనయ్యను చూసి కరణంగారి భార్య కడుపు నిండా అన్నం పెట్టింది.

ఆకలిగా ఉండడంతో అంతా తినేశాడు. అప్పుడు గుర్తొచ్చింది అతనికి భార్య సంగతి.

భార్య భోజనము చేయలేదని, అతని అసహాయ స్థితికి అతని కళ్ళ వెంట కన్నీరు ప్రవహించసాగింది.

అదే సమయములో కరణంగారి పెద్ద కోడలు మంచినీళ్ళ బిందెతో ఇంట్లోకి రావడం కనిపించింది. మడిలో మంచినీళ్ళు తెచ్చి, వంట చేసి దేవుడికి నైవేద్యం పెట్టడం ఆ ఇంట్లో వాళ్ళ అలవాటు.

ఆ రోజు మనయ్య రాకపోవడంతో కరణంగారి కోడలు మంచినీళ్ళ బావి దగ్గరకు వెళ్ళి తేవలసి వచ్చింది

పాతిక ఎకరాల మాగాణి భూమి, వంద తులాల బంగారాన్ని తనతో పాటు తీసుకు వచ్చిన పెద్ద కోడలంటే కరణంగారికి ప్రత్యేక అభిమానము.



మనయ్య పనిలోకి రాకపోతే మనయ్య చెయ్యవలసిన పనులతో పాటు నీళ్ళు కూడా తేవలసిన బాధ్యత పెద్దకోడలి మీద పడుతుంది అన్న ఊహ భరించలేక పోతున్నారు కరణంగారు

ఎక్కువ రోజులు కరణం గారింటి పనులు చేస్తూనే కాలం గడిపే వాడు ఇది వరకు.

తన సమస్యను కరణంగారి ముందు చెప్పడానికి భయపడుతున్నాడు.

మనయ్య భయాన్ని గమనించిన కరణంగారు, "ఇదివరకు చేసే పనులన్నింటినీ మానేయవోయ్" అన్నారు తను చెప్పబోయే దానికి ఉపోద్ఘాతంలా.

"నాకు, నా భార్యకు బ్రతకడానికి మార్గం చూపించి పుణ్యం కట్టుకోండి బాబయ్య" అన్నాడు కన్నీటితో

గడుసులోకం —బాబు



మనయ్య మరణం

భార్యను సర్వ సౌఖ్యాలతో ముంచెత్తాలని లేకపోయినా, కనీస అవసరాలను తీర్చవలసిన బాధ్యత తన మీద ఉందని అనుకున్నాడు భార్యను కష్టపెట్ట కూడదనుకున్నాడు. తానెంత కష్టపడయినా, భార్యను సుఖ పెట్టా లనుకున్నాడు. భార్యను ఏ పనీ చెయ్య నివ్వదలచుకోలేదు. కరణంగారు చెప్పబోయే ఏ పనైనా తన భార్యను సుఖపెట్టగలిగేదైతే చెయ్యదలచుకున్నాడు. ఇంతవరకు తనకు నా అన్న వాళ్ళెవరూ లేరు. ఈ ప్రపంచంలో ఇప్పటికి తన మనిషి అన్న వ్యక్తి 'భార్య' అనుకుంటే అతని మనసు దూది పింజలా తేలిపోసాగింది.

ఒళ్ళంతా చెవులు చేసుకొని కరణంగారు చెప్పబోయే దానిని వినడానికి సిద్ధమయ్యాడు

"మనయ్యా! ఇన్నాళ్ళు నువ్వు ఒక్కడివే ఈ రోజు నుంచి నీ భార్యను పోషించవలసిన బాధ్యత కూడా నీదే. ఇద్దరి కడుపులు నిండాలి. ఇదివరకు మాదిరిగా కాస్త, కూస్త సంపాయిస్తే లాభం లేదు. ఇంకొన్నాళ్ళు పోతే ముగ్గురవుతారు అప్పుడు ఇంకాస్త కష్టమవుతుంది. అందుకని మన వూరి పెద్దలందరం కలసి ప్రొద్దున నీ గురించి ఆలోచించాము నీకొక దారి చూపించాలనుకున్నాం."

"ఏమిటి బాబయ్య అది" అన్నాడు ఆత్రత ఆపుకోలేక.

"మన ఊళ్ళో అందరికి త్రాగడానికి మంచినీరు, ఊరి బయట బావుల నుంచి తెచ్చుకోవడం అందరి ఆడవాళ్ళకు సమస్యగా ఉంది కదా! అందుకని నువ్వు మా అందరి ఇళ్ళలో ఒక్కొక్కరికి ఒక్కొక్క బింది చొప్పున మంచినీళ్ళు ప్రతిరోజు తెచ్చి పోస్తూండు నీ కష్టం ఉంచుకోకుండా, మేమందరం బిందెకు నెలకు మూడు రూపాయల చొప్పున ఇవ్వదలచుకొన్నాం నీకు ఇష్టమేనా?" అన్నాడు.

కటిక చీకట్లో దిక్కు తోచక తిరుగాడుతున్న వ్యక్తికి, వెలుగు చూపించడమే కాకుండా, దారిని కూడా చూపుతున్న ఆ నిలువెత్తు మనిషికి కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియక, ఆనంద బాష్పాలను తుడుచుకుంటూ ఆయన పాదాలపై మోకరిల్లాడు

"చూడు మనయ్యా! నీకు ఏ కష్టం వచ్చినా, మన ఊళ్ళో వాళ్ళందరూ, నీ వాళ్ళనుకో, నీ కష్ట సుఖాలను మాతో పంచుకో" అంటూ వెన్ను తట్టి ఆశీర్వదించారు."

అమృత తుల్యమైన ఆ మాటలకు చలించి పోయాడు

ఒక మంచి రోజు చూసి నీళ్ళు ఇంటింటికి ఒకో బిందెతో తెచ్చి పోయడం మొదలు పెట్టాడు. రోజంతా శ్రమించినా, శ్రమ అనిపించేది కాదు ఉత్సాహంతో అడిగిన వాళ్ళందరికీ పోయడం మొదలు పెట్టాడు

ఒకో బిందెతో తెచ్చి పోస్తుంటే అందరికి సమయానికి అందించ లేకపోవడంతో 'కావిడి' తయారు చేయించుకున్నాడు కావడిలో అటు రెండు బిందెలు, ఇటు రెండు బిందెలు పెట్టుకొని పాటలు పాడుకుంటూ పరుగులు తీసేవాడు

ఉదయాన్నే లేచి, కావిడి భుజాన వేసుకొని, మంచినీటి బావికి వెళుతున్న మనయ్యను చూస్తే, సూర్యుడు కూడా ఉత్సాహంతో చరచరా పైకి వచ్చేవాడు బద్ధకాన్ని వదలి

నెల నెలా, వచ్చే సంపాదనలో ఇంటద్దె పోనూ, మిగిలిన వాటితో భార్యా, భర్త గుట్టుగా సంసారం సాగించేవారు

ఆ వాడలోని ఆడవాళ్ళందరినీ మనయ్య ఏదో ఒక వరసతో పిలిచేవాడు.

మనయ్య నీళ్ళ బిందెతో వచ్చేపటికి, ఆ ఇంటిలోని వాళ్ళు ఏదైనా పనిలో వుంటే, తానే లోపలికి వచ్చి బిందె కడిగి నీళ్ళు పోసి వెళ్ళేవాడు.

మనయ్య నీళ్ళు తెచ్చే సమయానికి వాళ్ళేదైనా, పచ్చడో, కూరో చేసుకుంటుంటే రుచి చూడమంటూ కాస్త గిన్నెలో పెట్టి ఇచ్చేవారు.

వండుకున్నమ్మకు ఒక రకమైతే, అడుక్కున్నమ్మకు అరవై రకాలన్నట్టు ప్రతిరోజు రెండు మూడు రకాల కూరలతో భోజనం చేసే వాడు మనయ్య.

అత్తా కోడళ్ళ వ్యవహారాలను చక్కదిద్దడంలో ఆరి తేరాడు

భార్యా, భర్తల పోట్లాట ల్లో మధ్యవర్తి వ్యవహారాలను అతి చాకచక్యంగా నడిపి వాళ్ళను కలపడంలో నిపుణుడయ్యాడు

పెళ్ళిళ్ళను కుదిరించడంలో పెద్ద వ్యవహారాల వ్యక్తిగా మారాడు

అన్నదమ్ముల ఆస్తి పంపకాలలో న్యాయ నిర్ణేత అయ్యాడు

ఆ వాడలోని ప్రతి వ్యక్తికి మనయ్యతో అవసరం ఉండేది పెద్ద, చిన్న, ముసలి, ముతక అందరూ మనయ్యతో కాలక్షేపం కబుర్లాడేవారు. ఎంత శ్రమించినా, మనయ్య మొఖంలో అలసటను గాని, చిరాకును గాని, ఏ నాడూ ఏ వ్యక్తీ గుర్తు పట్టలేదు.

ఆ ఊరిలోని వారి ఆప్యాయతతో ఆదరణతో మనయ్య జీవితం ఏ ఒడుదుడుకులు లేకుండా గడుస్తోంది

రాబోయే రోజులు ఇంకా హాయిగా గడపవచ్చని కలలు కనేవాడు.

అన్నీ మనం అనుకున్నట్టు జరిగితే, భగవంతుణ్ని అందరూ మరిచేవారు

మనయ్య ఆ రోజు కావిడితో బయలుదేరగానే ఊళ్ళో చాల మంది క్రొత్త వాళ్ళు కనిపించారు. వాళ్ళెందుకు వచ్చారో, ఏం చేస్తారో తెలుసుకోవాలన్న ఆసక్తి లేదు ఊరంతా సందడిగా, కోలాహలంగా ఉంది. పెద్దలందరూ రచ్చబండ వద్ద సమావేశమయ్యారు ఊరంతా గోతులు తవ్వుతున్నారు కూలీలు.

ఆ గోతు లెందుకో, ఆ సంబరుయేమిటో అర్థం కాలేదు

ఒకచోట కావిడిని దింపి, "ఇవన్నీ ఎందుకు తవ్వుతున్నారు" అని అడిగాడు



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎ. పి. కలకత్తా

దంపతుల్లో ఒకరి రక్తం ఆర్ హెచ్. పాజిటివ్‌గాను, మరొకరిది ఆర్ హెచ్. నెగిటివ్‌గాను ఉండే వారికి పిల్లలు దక్కే అవకాశం లేదా? సహజంగా మానవ రక్తం ఎక్కువగా పాజిటివ్‌గా ఉంటుందా? నెగిటివ్‌గా ఉంటుందా?

★ ఆ స్త్రీలు ఆర్. హెచ్. యాంటిజన్ వాడటం వల్ల ఏ రోగము లేకుండా పిల్లలు పుట్టే అవకాశం ఉంటుంది ఒకవేళ ఆ యాంటిజన్ వాడకుండా పిల్లలు పుట్టినప్పుడు వారికి ఎరిత్రో, బ్లాస్టోసిస్ ఫిటాలిస్ అనే జబ్బు వస్తే పుట్టిన వెంటనే ఎక్స్‌చేంజి ట్రాన్సుఫ్యూషన్ చేయటం ద్వారా చికిత్స చేసే అవకాశం ఉంటుంది. అంటే శిశువు శరీరంలోని రక్తం అంతా తీసి వేరే రక్తం ఎక్కించటం అని అర్థం సహజంగా ఆర్ హెచ్. పాజిటివ్ రక్తమే ఎక్కువగా ఉంటుంది

పి.వి.ఆర్. – తుని

నాకు ఇదివరకు ఫైలేరియా వల్ల కాలు వాచింది మందులు, ఇంజక్షనులు వాడాక తగ్గినది కాని కాలు చీలమండ వద్ద కొంచము వాపు ఉంటుంది ఇది తగ్గుటకు మార్గము వున్నదా? నెప్పి ఏమీ లేదు.

★ ఫైలేరియా వల్ల వచ్చిన వాపు పూర్తిగా తగ్గే అవకాశం చాలా తక్కువ. ఈ రకం వాపులు నొక్కితే గుంటపడవు. ఈ వాపుకి చికిత్స అనవసరం.

ఎమ్. కె. – విజయవాడ

నేను 11వ ఏట నుండి చదువుకి, చూపుకి (+) 13.5 మరియు (+) 12 5 కళ్ళద్దాలు వాడుతున్నాను ఇప్పుడు నా వయస్సు 30 సంవత్సరములు నేను సాంసారిక జీవితానికి పనికి వస్తానా? మా చుట్టాలాయనికి 40 ఏళ్ళ ప్రాయంలోనే కళ్ళు పూర్తిగా కనిపించటం లేదు నాకు 15, 20 రోజుల కొకమారు తలనెప్పి, జ్వరం వస్తుంటుంది ఒక్క నిద్ర, స్నానం సమయంలో తప్ప మిగతా సమయాలలో కళ్ళద్దాలు వుంటాయి.

★ మీరు వ్రాసినట్లు మీకు ఇవ్వబడిన కళ్ళద్దాల పవరు +• (ప్లస్) అవునాకాదా అనేది నా అనుమానం. మామూలుగా చిన్న వయస్సువారికి – (మైనస్) పవర్ వుండటం సహజం.

కళ్ళ పవర్‌కి సాంసారిక జీవితానికి ఏమీ సంబంధం లేదు. పవర్ ఇంత అధికంగా ఉన్నప్పుడు వెంట వెంటనే నిపుణుల వద్ద పరీక్ష చేయించుకోవలసి ఉంటుంది. దీనివల్ల జ్వరం వచ్చే అవకాశం ఉండదు. ఇంత పవర్‌అధికంగా వుండటానికి కెరటోకోనస్ అనే కళ్ళ రోగం కారణం అయి వుండవచ్చును. దీనికిగాను నిపుణుల చేత పరీక్ష చేయించుకోవాలి.

ఎం.పి.ఆర్. – కలవలపల్లి

ట్యుబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న తర్వాత ఎన్నాళ్ళకు రతిలో పాల్గొన వచ్చును?

★ కనీసం రెండు మూడు నెలలు ఆగటం మంచిది. శారీరకంగా ఏవిధమైన కష్టమూ లేకపోయినా మానసిక తృప్తి కోసం ఇలా ఆగటం మంచిది. ☐

మనయ్య మరణం

ఒక కూలిని.

ఆ కూలి మనయ్యను పిచ్చివాడిలా చూసి, "ఇంకా నీకు తెలియలేదా? మా ఊళ్ళో కుళాయిలు వేస్తున్నాము అంటే అందరి ఇళ్ళలోకి మంచినీళ్ళు వాటంతట అవే వచ్చేస్తాయి కుళాయి తిప్పితే ఎన్ని నీళ్ళు కావాలంటే అన్ని నీళ్ళు వాడుకోవచ్చు. ఇలా నీళ్ళు మోసుకుంటూ కష్టపడక్కరలేదు" అన్నాడు జాలిగా.

అనేక వందల పిడుగులు ఒకేసారి తల మీద పడినట్టయి కూలిపోయాడు తన జీవనాధారాన్ని ఎవరో లాక్కుపోతున్నట్టుగా దిగాలు పడ్డాడు

ఆ రోజు ఏ ఇంటికి నీళ్ళు మోసుకు వెళ్ళినా, ఒకే మాట మా ఇంట్లోనూ, కుళాయి వేయించుకుంటున్నామని.

ఊళ్ళో వాళ్ళు మన ఊరికి నీటి దరిద్రం వదిలింది అన్నారు.

ఊరికి వదిలిన దరిద్రం తనకు పట్టుకుందనుకున్నాడు మనయ్య.

ప్రభుత్వం చేయదలచుకొన్న పనులన్నింటినీ చక, చకా పూర్తి చేసింది వీధి కొక కుళాయి చేయించింది ఆ కొత్త కుళాయిలతో వీధులన్నీ కొత్త పెళ్ళి కూతుళ్ల లాగా కళకళలాడుతున్నాయి

ఆ వాడలోని వాళ్ళకే కాదు, ఈ ఊరిలోని వాళ్ళకు కూడా మనయ్యతో అవసరం తీరింది

కావిడి భుజాన వేసుకొని పది సంవత్సరాలయింది. పది సంవత్సరాలలోనూ ఊరి వాళ్ళలో మనయ్య పట్ల అభిమానం పెరిగిందే కాని తరగలేదు

ఆ కొళాయిలు వచ్చిన దగ్గర నుంచి అందరూ తనకు దూరమయ్యారని బాధ పడడం మొదలు పెట్టాడు.

కన్నతండ్రిలా ఆదరించి, కష్టంలోను, సుఖంలోను దరి చేర్చుకున్న కరణం గారు కాలం చేశారు

తన కష్టాన్ని తీర్చే నాథుడు ఎవరూ లేరు కనపడిన వాళ్ళందరిని అడిగే వాడు తనకేదైనా మార్గం చూపించమని

"నీకు నీళ్ళు తెచ్చి పోయడం తప్ప ఇంకేం పని చేతనవును" అంటూ ఎకసెక్కాలాడే వారు కుర్రకారు.

పట్నం వాసనలను అణువణువుగా అలంకరించుకోంటోంది ఆ ఊరు పల్లెలోని ప్రజలు కూడా ప్రక్కింట్లో ఏం జరుగుతుందో కూడా గమనించడం మానేశారు

ఆలోచించి, ఆలోచించి చివరకు ఒక నిశ్చయానికి వచ్చాడు

తనకు ఆ ఊరికి ఋణం తీరిపోయిందనుకున్నాడు తన అవసరం ఆ ఊరి వారికి అక్కర లేదని తెలుసుకున్నాడు అంత వరకు ఆ ఊరి వారి ఆదరణతో, ఆప్యాయతతో పెంచుకున్న శరీరం వారి నిరాదరణకు తట్టుకోలేక పోతోంది వీధిన ఉన్న ప్రతి కొళాయి తనను అపహాస్యం చేస్తున్నట్టుగా భావించాడు ఆ అపహాస్యాన్ని తట్టుకోలేని మనయ్య ఒక కొళాయి దగ్గరకు చేరాడు తన తలను ఆ కొళాయికి వేసి కొట్టుకుంటున్నాడు. కొట్టుకొని, కొట్టుకొని అలసిపోయాడు రక్తం కుళాయి వెంట నీరులా కారింది

చిట్లిన మనయ్య తల శాంతి కోసం కొట్టిన గుమ్మడి కాయలా ఉంది

ఊరంతా నిశ్శబ్దంగా నిద్దరోతుంది.

నోరులేని జీవాలు మూగగా రోదిస్తున్నాయి.

తెల్లవారింది ఊరంతా లేచింది మనయ్య కొళాయి వద్ద మరణించాడన్న వార్త ఊరంతా గుప్పుమంది

ఒక్కొక్కరు ఆ కొళాయి వద్దకు చేరుతున్నారు మనయ్య మంచితనాన్ని పొగుడుతున్నారు బతకని బిడ్డ బారెడన్నట్టు అందరి నోటి నుంచి మనయ్యను గురించిన పొగడ్తలే.

రాత్రి మనయ్య మరణం చూసిన చందమామ మబ్బులో మెల్లగా జారుకుంటోంది తనను ఎవరైనా సాక్ష్యం అడుగుతారేమోనని!

సూర్యుడు రివిగా ఉదయిస్తున్నాడు తననెవరైనా సాక్ష్యం అడిగితే నాకేమీ తెలియదు అని చెబుదామన్న ధీమాతో

మనయ్య జీవితం మట్టి కలిసింది * ☐